JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 08-06-2026
Medchal - Malkajgiri । Monday 08-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 07
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 07 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# మార్కెట్లో నకిలీ విత్తనాలు

## జాగ్రత్తగా లేకుంటే రైతుల వ్యవసాయానికి మొదటికే మోసం



**ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చుకుని పంటలు పండించే రైతులకు చీడ, పీడలతోనే కాదు.. రైతు సమాజానికి చీడపురుగుల్లా దాపురించిన నకిలీ విత్తన విక్రేతలతోనూ ప్రమాదం ఏర్పడింది. వీరితో జాగ్రత్తగా లేకుంటే రైతుల వ్యవసాయానికి మొదటికే మోసం వచ్చేలా పరిస్థితులున్నాయని అధికారులంటున్నారు. తమ కంపెనీ విత్తనాలు వాడితే పంట సాగులో చీడ పీడల బెడద ఉండదని, వాటి నివారణ కోసం ప్రత్యేకంగా ఎలాంటి ఎరువులు వాడాల్సిన అవసరమే రాకుండా పంటలు సాగు చేయొచ్చనే ఆశలు చూపించి అమాయక రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తన విక్రేతలు మార్కెట్ లో చొరబడ్డారు. వారిని నియంత్రించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది.**

**జయభేరి, అదిలాబాద్, జూన్ 7 :**

కొత్త కొత్త బ్రాండ్లతో రైతులకు విత్తనాలను అంట గట్టేందుకు మహారాష్ట్ర లోని కొన్ని నాసిరకం విత్తన తయారీ సంస్థల్లో తయారైన విత్తనాలను జిల్లాలో మార్కెటింగ్ కోసం తీసుకొచ్చి జిల్లాలో కొందరు సీడ్స్ షాపులకు సప్లై చేస్తునట్లు తెలుస్తోంది. ఆయా కంపెనీల ప్రతినిధులు నేరుగా అయాయక రైతులకే అమ్ముతున్నట్లు రైతులు చెబుతున్నారు. నకిలీ విత్తన విక్రేతలు మార్కెట్ లోకి వచ్చేశారు. నేరుగా రైతులకే కాకుండా విత్తనాల డీలర్లకు కూడా ఎక్కువ మొత్తంలో కమిషన్ ఆశ చూపి తమ కంపెనీలకు చెందిన విత్తనాలను ఎక్కువ మొత్తంలో మార్కెట్లో విక్రయించేలా ప్లాన్ చేస్తున్నారు. అయాయక చిన్న సన్నకారు రైతులను ఈ నకిలీ విత్తన విక్రేతలు బురిడీ కొట్టించి నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం పొంచి ఉంది.ఇప్పటికే కొన్ని కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీకి చెందిన బ్రాండ్ల విత్తనాల గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తూ సీడ్స్ మార్కెట్ చేస్తున్నట్లు రైతులు అంటున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై నకిలీ విత్తనాల విషయంలో ఓ పక్క రైతులను చైతన్యపరుస్తూనే, మరో పక్క నకిలీ విత్తనాల నియంత్రణ కోసం వ్యవసాయ శాఖ, పోలీస్, రెవెన్యూ తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలతో జిల్లా వ్యాప్తంగా సీడ్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఈ టాస్క్ ఫోర్స్ టీంలు విస్తృతంగా తిరుగుతూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండటంతో సీడ్స్ షాప్ నిర్వాహకులు ఆందోళనకు గురవుతున్నారు.జిల్లాలో 455 విత్తనాలు విక్రయించే రిజిష్టర్డ్ షాప్స్ ఉన్నాయి. రైతులు ప్రతి సీజన్ లో తమకు అందుబాటులో ఉన్న షాపుల్లో రెగ్యులర్ గా వెళ్లి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రిజిస్ట్రార్డ్ సీడ్స్ షాపుల్లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి సీడ్స్ అమ్మకాలు జరపాల్సి ఉంది. కొన్ని షాపుల్లో ఎక్కువ మొత్తంలో కమిషన్లు చెల్లించే కంపెనీలకు చెందిన బ్రాండ్లు కూడా అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. నిబంధలను విరుద్ధంగా అమ్మాల్సిన కొత్త కంపెనీలకు చెందిన విత్తనాలను షాపుల్లో కాకుండా ఇతర రహస్య ప్రాంతాల్లో ఉంచి వాటిని కావాలనుకున్న రైతులకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయ పనుల కోసం రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వర్షాలు కురవడం ప్రారంభం కాగానే వ్యవసాయ పనులు కూడా ఊపందుకోనున్న తరుణంలో రైతులు ముందుగా విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల ఏరివేతకు, వాటి నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ టీంలు అన్ని సీడ్స్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. ఎక్కడా ఏ షాపును వదలకుండా అన్ని షాపులను ఈ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. షాపుల్లో ఎలాంటి అనుమానాస్పద ప్రొడక్ట్ కనిపించిన.. అవి నకిలీ విత్తనాలని తేలినా చట్టపరమైన చర్యలు తప్పవని, షాపు లైసెన్సు కూడా రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. నకిలీ విత్తనాలు లేని జిల్లాగా రైతులు ఆరోగ్యకరమైన వ్యవసాయం చేసుకునే వాతావరణాన్ని కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వీరాస్వామి అన్నారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, ప్రతి మంగళవారం రైతు వేదికల్లో ఏర్పాటు చేస్తున్న సమావేశాల్లో కూడా రైతులకు నకిలీ విత్తనాలపై ఏడీఏలు, ఏఈఓ లు అవగాహన కల్పిస్తున్నట్లు జేడీఏ తెలిపారు. అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన విత్తనాలు విక్రయించే షాపులన్నింట్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నటు తెలిపారు.



# నేడు మృగశిర కార్తె..

## • నాంపల్లిలో చేప మందు పంపిణీకి భారీ ఏర్పాట్లు

**జయభేరి, హైదరాబాద్, జూన్ 7 :**



తెలంగాణలో ప్రతి ఏడాది మృగశిర కార్తె సందర్భంగా నిర్వహించే ప్రసిద్ధ చేప మందు పంపిణీ కార్యక్రమం ఈ ఏడాది కూడా నేడు (జూన్ 8) రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వేదికగా ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం మంగళవారం (జూన్ 9) రాత్రి వరకు నిరంతరాయంగా 24 గంటలపాటు కొనసాగనుంది. గత 176 సంవత్సరాలుగా బతిని గౌడ్ కుటుంబం ఉచితంగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. ఉబ్బసం (ఆస్తమా), శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి బతికున్న చిన్న కొర్రమీను చేప పిల్ల నోటిలో ప్రత్యేక మూలికల పేస్ట్ ఉంచి మింగిస్తారు. శాఖాహారులకు చేపకు బదులుగా బెల్లంతో కలిపిన అదే మూలికల ప్రసాదాన్ని అందజేస్తారు.

### భారీగా తరలిరానున్న భక్తులు

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈసారి సుమారు 1.4 లక్షల చేప పిల్లలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. క్యూలైన్ల వద్ద ఫ్యాన్లు, కూలర్లు, తాగునీటి సదుపాయాలు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు, ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నగరంలోని ప్రధాన బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్ల నుంచి ప్రత్యేక రవాణా సదుపాయాలు కూడా కల్పించారు.

### మందు తర్వాత తప్పనిసరిగా డైట్

చేప మందు తీసుకున్నవారు 45 రోజులపాటు ప్రత్యేక ఆహార నియమాలు పాటించాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. ఈ కాలంలో కొన్ని రకాల మాంసాహారం, నూనె పదార్థాలు,

...మిగతాది 2 లో

# అభివృద్ధి చేసుకుందాం

## సహకరించడానికి నేను సిద్ధం



- ఉప్పల్ భగాయత్ లే అవుట్ లో 1511 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- 10 ఎకరాల్లో 98 కోట్లతో నిర్మించే మల్కాజ్ గిరి మునిసిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం కోసం శంకుస్థాపన.
- 960 కోట్ల రూపాయలతో ఏఓసి సెంటర్ లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన.
- 416 కోట్లతో టీకేఆర్ కాలేజ్ జంక్షన్ లో 6 లేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన.
- 37.50 కోట్లతో 100 పడకల మల్కాజ్ గిరి జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన.
- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత మహానేత రాజిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**జయభేరి, ఉప్పల్, జూన్ 7 :**

నాగోల్ నుంచి గౌరెల్లి వరకు మూసీ నది ప్రక్షాళన ఫేజ్ 2 కు వంద రోజుల్లో పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూసీ నది పునరుజ్జీవం కోసం తొలి దశగా గండిపేట నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు ప్రారంభించగా మరో దశగా నాగోల్ నుంచి గౌరెల్లి వరకు కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని స్పష్టం చేశారు. ఉప్పల్ భగాయత్ - ఫేజ్ III లో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.98 కోట్లతో నిర్మించే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి రూ. 1,511 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణంతో పాటు, రూ. 960 కోట్లతో AOC సెంటర్‌లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, రూ. 416 కోట్లతో టీకేఆర్ కాలేజ్ జంక్షన్‌లో 6 వరుసల్లో ఫ్లై ఓవర్ నిర్మాణం, రూ. 37.50 కోట్లతో 100 పడకల మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో CURE 1- Initiative (Common Unified Billing and Collection System) క్యూర్ 1 యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మూసీ నది ప్రక్షాళన ఆవశ్యకతను, నగర అభివృద్ధి ప్రణాళికలు, మెట్రో విస్తరణ, పరిపాలనా సౌలభ్యం కోసం కోర్ ప్రాంతాన్ని మూడు ప్రాంతాలుగా వికేంద్రీకరించడం వంటి అంశాలను ప్రజలకు వివరించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరం అని చెప్పుకుంటే సరిపోదని, ఆ స్థాయిలో అభివృద్ధి

...మిగతాది 2 లో


# అమరావతి కేంద్రంగా కీలక మార్పులు



**జయభేరి, అమరావతి :**

అమరావతి కేంద్రంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. నిర్మాణాల ప్రక్రియ ఊపందుకుంది. ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా కేంద్ర సాయంతో రుణ సమీకరణ చేస్తున్నారు. రెండో విడత భూ సమీకరణ కొనసాగుతోంది. ఇదే సమయంలో పాలనా పరంగా కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారు. కీలక మార్పులు చేసారు. ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు కేటాయిస్తున్నారు. 2028 నాటికి నిర్మాణాలతో పాటుగా రాజధాని లక్ష్యంగా ప్రణాళికా

...మిగతాది 2 లో



# ప్రపంచ పర్యాటక కేంద్రంగా యాదగిరిగుట్ట

**జయభేరి, యాదగిరిగుట్ట :**

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మికపర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న “రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి ప్రత్యేక సాయం పథకం” కింద రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేసింది. దీంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి మహార్దశ పట్టనుంది. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మికపర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న “రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి ప్రత్యేక సాయం పథకం” కింద రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేసింది. దీంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## నేడు మృగశిర కార్తె..

చల్లని ఆహారాలకు దూరంగా ఉండాల్సి ఉంటుంది. అలాగే ఆరుద్ర, పునర్వసు, పుష్యమి కార్తెల సమయంలో ప్రత్యేకంగా అందించే మందు బిళ్లలను కూడా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**శాస్త్రీయ చర్చలు కూడా...**

చేప మందు సంప్రదాయం దశాబ్దాలుగా కొనసాగుతున్నప్పటికీ, దీనిపై వైద్య వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు ఇది సంప్రదాయ వైద్య విధానమని భావిస్తే, ఆధునిక వైద్య నిపుణులు దీని ప్రభావంపై శాస్త్రీయ ఆధారాలు పరిమితంగా ఉన్నాయని పేర్కొంటున్నారు. అయినప్పటికీ ప్రజల్లో ఉన్న విశ్వాసం కారణంగా ప్రతి ఏడాది భారీ సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

**సందర్శకులకు సూచనలు**

తెల్లవారుజామునే చేరుకుంటే క్యూ తక్కువగా ఉండే అవకాశం ఉంది. వృద్ధులు, చిన్నపిల్లలు అవసరమైన మందులు వెంట తీసుకెళ్లాలి. తాగునీరు, గుర్తింపు కార్డులు, అవసరమైన వ్యక్తిగత వస్తువులు వెంట ఉంచుకోవాలి. అధికారుల సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఈ నేపథ్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో భారీ జనసందోహం ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు రవాణా ఏర్పాట్లను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు.

## అభివృద్ధి చేసుకుందాం

జరగాలని చెప్పారు. నగరంలో 122 కి.మీ మేరకు అన్ని వైపుల మెట్రోను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్, రాజేంద్రనగర్ మీదుగా అంతర్జాతీయ విమానాశ్రయం వరకు, అలాగే ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు విస్తరిస్తామని చెప్పారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. మెట్రోతో పాటు రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ ప్రక్షాళన వంటి నగర అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. నగర అభివృద్ధిలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్, యూపీలో గంగానది ప్రక్షాళన చేసుకున్నప్పుడు మూసీ నదిని ఎందుకు ప్రక్షాళన చేయొద్దని ప్రశ్నించారు. 55 కిలోమీటర్ల మూసీ నదిని ప్రక్షాళన చేసుకుంటే నగరం అభివృద్ధి సాధించడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మూసీ పరివాహక ప్రాంతంలో ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారు. నివసించడానికి ఏమాత్రం వీలులేకుండా కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విపరీతమైన వ్యర్థాలు, పారిశ్రామిక కాలుష్యం, కళేబరాలతో విషయం నల్గొండ ప్రజల జీవితాలను కాటేస్తోంది. నల్గొండ జిల్లాలో ఒకవైపు ఫ్లోరైడ్ సమస్య, మరోవైపు మూసీ కాలుష్యంతో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. అలాంటప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం లేదా అని అన్నారు. ఏ పేదవాడికి అన్యాయం చేయం. ఏ పేదవాడిని నిరాశ్రయులుగా చేయబోం. ఇళ్లు కోల్పోయిన వారికి ఇండ్లు ఇస్తాం. వారి పిల్లలకు మంచి చదువులు చెప్పిస్తాం. ఈ మల్కాజిగిరి ప్రాంతం గతంలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రేటర్ హైదరాబాద్ లతో కలిసి నాలుగు రకాల పరిపాలన జరిగేది. ఒకరి మధ్య మరొకరికి సమన్వయం లేక అభివృద్ధికి అడ్డంకిగా మారింది. అంతర్జాతీయ నగరం అని చెప్పుకోవడం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి జరిగినప్పుడే గుర్తింపు వస్తుంది. ఓఆర్ఆర్ లోపల 1.34 కోట్ల మంది ప్రజలు, వివిధ అంతర్జాతీయ కంపెనీలు ఏర్పాటవుతున్న సందర్భంగా ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు, మెట్రో, విద్యుత్, పోలీసు, మురుగునీటి పారుదల, మూసీ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉంది. రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతోనే తెలంగాణ విజన్ 2047 డాక్యుమెంట్ తెచ్చాం. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం 2100 చ.కి.మీ ప్రాంతాన్ని క్యూర్ (కోర్ అర్బన్ రీజినల్ ఎకానమీ) ప్రాంతంగా గుర్తించి పలిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మూడు కార్పొరేషన్లుగా వికేంద్రీకరించినట్టు తెలిపారు. ఇదే పద్ధతిలో పోలీసు వ్యవస్థను కూడా వికేంద్రీకరించామని అన్నారు. లోక్‌సభ సభ్యుడిగా మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో ఆనాడు ఆశించిన స్థాయిలో పనులు చేయలేకపోయానని ముఖ్యమంత్రి పేర్కొంటూ మెట్రో విస్తరణతో పాటు ప్రతి పనిని చేసే బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. “మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనంతో పాటు వందల కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చే బాధ్యత నాది. అవసరమైన అనుమతులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని చెప్పారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఈ ప్రాంతానికి సుపరిచితులైన బండారి రాజిరెడ్డి పెట్టామని గుర్తుచేస్తూ చౌరస్తాలో వారి విగ్రహం కూడా పెడదామన్నారు.

## అమరావతి కేంద్రంగా..

బద్ధంగా ముందుకు వెళ్తున్నారు. అమరావతి కేంద్రంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి పరిపాలనలో మార్పులు చేశారు. కొత్త కమిషనర్ విజయరామరాజు వచ్చిన తరువాత మొత్తం రాజధాని ప్రాంతాన్ని గ్రిడ్లుగా మార్చి తొమ్మిది జోన్లు ఏర్పాటు చేశారు. ఈ మేరకు మే 26న కమిషనర్ విజయరామరాజు అధికారిక ఆదేశాలు జారీ చేశారు. పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం అధికారులను, సిఆర్‌డిఎలో ల్యాండ్ పూలింగు యూనిట్లను విభజిస్తూ సిసిఎల్ఎకు, గ్రామ, వార్డు సచివాలయ విభాగాలకు మే నాలుగో తేదీన లేఖ రాశారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి అనుమతి రాగానే ఇటీవల రాజధాని అమరావతి ప్రాంతం మొత్తాన్ని తొమ్మిది జోన్లుగా మార్చారు. దీనిలో ప్రస్తుత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్న కొండమరాజుపాలెం రెవెన్యూను సెంట్రల్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈస్ట్ జోన్ పరిధిలోకి కృష్ణాయపాలెం, పెనుమాక, ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి ఐనవోలు, నార్త్ ఈస్ట్ జోన్లోకి లింగాయపాలెం, ఉండవల్లి, వెంకటపాలెం, నార్త్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, మందడం రెండు యూనిట్లు తీసుకొచ్చారు. అమరావతిలో ఇక నుంచి కొత్తగా అదే విధంగా నార్త్ వెస్ట్ జోన్ పరిధిలో అబ్బురాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, సౌత్ ఈస్ట్‌లోకి నవులూరు 1, 2 యూనిట్లు, సౌత్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి కురగల్లు రెండు యూనిట్లు, నిడమర్రు రెండు యూనిట్లు కలిపారు. వెస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుల్లూరు రెండు యూనిట్లు, అనంతవరం గ్రామాలను తీసుకొచ్చారు. అలాగే రెండోదశలో ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందిని నియమించారు. భూమి విస్తీర్ణం ఆధారంగా కొన్ని గ్రామాల్లో అదనపు సర్వేయర్లను నియమించారు. ఇవికాకుండా రాజధాని నగరంలో ల్యాండ్స్ విభాగానికి ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీనిలోనూ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తోపాటు పది మందిని నియమించారు. అలాగే ఏపిసిఆర్‌డిఏ కోసం ప్రత్యేక ల్యాండ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ గ్రామాల్లో కాంపిటెంట్ అథారిటీలే అన్ని వ్యవహారాలు చూసేవారు. ఇక నుండి జోనల్ స్థాయిలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఆయా జోన్ల పరిధిలోకి వచ్చే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సి ఉంటుంది. భూ యజమానులు నేరుగా సిఆర్‌డిఏ కార్యాలయానికి వెళ్లకుండా ఆయా జోన్ల పరిధిలోని సమస్యలు పరిష్కరించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఒంటరి మహిళపై అత్యాచారం

- నిందితులు ఇరువురు అన్నదమ్ముల అరెస్ట్

**జయభేరి, నకరికల్లు :**

పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజర్ల గ్రామ శివారులో ఒంటరి మహిళపై పలుమార్లు అత్యాచారం చేసిన కేసులో నిందితులైన కొత్తపల్లి సుధాకర్, అతని సోదరుడు శ్రీనును పోలీసులు అరెస్ట్ చేశారు. సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ పి. కిరణ్ ఆధ్వర్యంలో నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ప్రధాన నిందితుడు సుధాకర్‌పై గతంలోనూ మహిళల వేధింపులు, మోసం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ కిరణ్ హెచ్చరించారు.

# తొంబై వసంతాల వైభవం

## విశ్వఖ్యాతిని పొందుకున్న సందర్భం

**భారత ప్రజల హృదయ స్పందన ఆకాశవాణి... మొట్టమొదలు రేడియోలో విన్న జ్ఞాపకం మరచిపోని తీపి మధురానుభూతి... గాలిలో మాటలు, పాటలు వినిపిస్తుంటే ఎక్కడి నుంచి వస్తున్నాయని తొంగి చూసిన అమాయకత్వం... నిజానికి ఆలిండియా రేడియో ఆకాశవాణి..**

**ప్రజలందరికీ జన హృదయాన్ని గెలుచుకున్న తీరు సాగిన గమనం వర్ణనాతీతం**




**జయభేరి, హైదరాబాద్ :**

**కుల మత భేద ప్రాంత వర్ణ లింగ వివక్షత లేకుండా ప్రతి ఒక్కరిని గౌరవిస్తూ ప్రేమతో పలకరించే రేడియో జాకీల మాటల తేనెల ఊటలు.... ఎంత వర్ణించినా తక్కువే..! అందుకే...**

"బహుజన హితాయ - బహుజన సుఖాయ" అనే మహోన్నత ఆశయంతో భారత ప్రజల జీవితాల్లో తొంబై సంవత్సరాలుగా తనదైన ముద్ర వేస్తున్న ప్రసార మాధ్యమం ఆకాశవాణి నేడు అందరి బంధువుగా మారింది. 1936 జూన్ 8న ఆల్ ఇండియా రేడియోగా ప్రారంభమై ఇవ్వాల్టికి సరిగ్గా 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంది ఈ సంస్థ, 1957లో "ఆకాశవాణి"గా పేరు పొందింది. నేడు ప్రసార భారతి ఆధ్వర్యంలో భారతదేశ జాతీయ రేడియో ప్రసార సంస్థగా కోట్లాది శ్రోతల అభిమానాన్ని చూరగొంటూ ప్రపంచ వ్యాప్తంగా విజయవంతంగా 90 వసంతాలను పూర్తి చేసుకుంది. ఆకాశవాణి కేవలం ఒక ప్రసార సంస్థ మాత్రమే కాదు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం, సంగీతం, విజ్ఞానం, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, క్రీడలు, కళలు, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మహోన్నత ప్రజామాధ్యమం. గ్రామీణ రైతు నుండి మేధావి వరకు, విద్యార్థి నుండి అధికారుల వరకు AM (ఆంప్లిట్యూడ్ మాడ్యులేషన్) నుండి FM (ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్) నుండి డిజిటల్ రేడియో (Digital Radio) DAB (డిజిటల్ ఆడియో బ్రాడ్కాస్టింగ్ వరకు, అంచలంచెలుగా ఎదుగుతూ అందరి మన్ననలు పొందుతూ, అనునిత్యం పోటీ ప్రపంచాన్ని ఓలలాడిస్తు ప్రతి ఒక్కరి జీవితంతో మమేకమైన విశ్వసనీయ, హృదయ రంజిత, సమాచార వేదిక ఆల్ ఇండియా రేడియో ప్రసార భారతి ఆకాశవాణి. భారతీయ మొట్ట మొదటి ప్రసార మాధ్యమం మన ఆకాశవాణి.

ప్రతిరోజూ ప్రాతఃకాల వందనాలతో ప్రారంభమై భక్తి కార్యక్రమాలు, ఆరోగ్య సూచనలు, విద్యా ప్రసంగాలు, న్యాయ సలహాలు సూచనలు, మధ్యాహ్నపు సంగీత విభావరి, సాయంత్రపు జానపద గేయాలు, సాహిత్య చర్చలు, రాత్రి హాయి రాగాలతో శ్రోతలను అలరిస్తూ మైమరపిస్తూ రేడియోకు కట్టిపడేసే ప్రేమను పంచి పెట్టింది. పిల్లల కోసం బాలానందం, విద్యార్థుల కోసం విద్యా కార్యక్రమాలు, రైతుల కోసం వ్యవసాయ సలహాలు, మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, ఉద్యోగార్థుల కోసం ఉద్యోగ వార్తలు, కళాకారుల కోసం సృజనాత్మక వేదికలను అందిస్తూనే ఉంది. సంవత్సరంలోని ప్రతి నెల, ప్రతి పండుగ, ప్రతి ఉత్సవం, ప్రతి సంస్కృతిక విశేషాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చిన ఘనత ఆకాశవాణిదే. ఉగాది, సంక్రాంతి, దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్ వంటి పండుగలతో పాటు భారతీయ సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాల గొప్పతనాన్ని తరతరాలకు చేరవేసింది మన ఆకాశవాణి.

ఎందరో సంగీత విద్వాంసులు, సాహితీ మూర్తులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, కవులు, కళాకారులు, పరిశోధకులు, పరిపాలనా అధికారులు, ప్రజా నాయకులు, వ్యాపారవేత్తలు, సామాజిక సేవకులు తమ అనుభవాలను ఆకాశవాణి ద్వార



**ఎన్. దీనబాంధవ**
**రేడియో వ్యాఖ్యాత**
**నాటక రచయిత, దర్శకులు**

ప్రజలతో పంచుకున్నారు. ప్రతిష్టాత్మక అవార్డు గ్రహీతలు నంది, గద్దర్, పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, భారతరత్న వంటి అత్యున్నత పురస్కార గ్రహీతలతో ముఖాముఖి సంభాషణలు, నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు శ్రోతల పాలిట బహుమానాలుగా మారిపోయాయి. ప్రజారోగ్య రంగంలో ఆకాశవాణి చేసిన సేవలు అమూల్యం. ఆరోగ్య పరిరక్షణ, యోగా, వ్యాయామం,వ్యాధి నివారణ, వైద్య సలహాలు, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, జీవనశైలి వంటి అంశాలపై వైద్య నిపుణులతో నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారాలు కార్యక్రమాలు లక్షలాది మందికి ధైర్యాన్ని నింపడమే కాదు మంచి ఆరోగ్య అవగాహన కల్పించడంలో ఎప్పుడూ ముందుంటుంది మన ఆకాశవాణి.

వ్యవసాయ రంగంలో రైతులకు పంటల సాగు విధానాలు, ఎరువుల వినియోగం, దిగుబడి పెంపు, ఏ పంట రాబడి, ఏంటి ఎలాంటి విత్తనాలను ఎలాంటి భూములకు అవసరం, వాటి సాంద్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనుసరించవలసిన విధానాలు మార్కెట్ పరిస్థితులు, విలువైన సమాచారాన్ని అందిస్తూనే ఉంటుంది మన ఆకాశవాణి. విద్యార్థులకు పోటీ పరీక్షల మార్గదర్శకత్వం, ఉన్నత చదువులు ఉత్తమ అవకాశాలు, విశ్వవిద్యాలయాల ఆచార్యులచే ప్రసంగాలు, పాఠ్యాంశాలు, బోధనలు ,విషయాల పట్ల అవగాహనలు, పోటీ పరీక్షలకు నియమ నిబంధనలు, ఉద్యోగ సమాచారాలు,మారుతున్న పోకడలు అవకాశాలు, అన్ని అంశాలలో ఆరి తేరి ఉత్తీర్ణులైనా మేధావులను ఆహ్వానించి, వారి వారి విజయాల పరంపరలు వివరిస్తూ వారిని పరిచయం చేస్తూ, వారు చదువుకున్న రోజుల్లో పాటించిన క్రమ శిక్షణాలను, అనుసరించిన పద్ధతులను, విద్యార్థులకు ఎప్పటికప్పుడూ అందించడంలో ముందుంటుంది మన ఆకాశవాణి. క్రీడా ప్రపంచంలోనూ ఆకాశవాణి ప్రత్యేక గుర్తింపు పొందింది. ముఖ్యంగా క్రికెట్ ప్రత్యక్ష ప్రసారాలు లక్షలాది మంది అభిమానులను ఉత్కంఠభరిత అనుభూతికి గురిచేశాయి. ప్రతి బంతి, ప్రతి పరుగు, ప్రతి వికెట్ను కళ్లకు కట్టినట్లు వినిపించిన వ్యాఖ్యానాలు శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. రేడియో నాటకాలు, నాటికలు, రూపకాలు, హాస్య కార్యక్రమాలు, జానపద గేయాలు, లలిత సంగీతం, శాస్త్రీయ సంగీత కచేరీలు, భజనలు, బృందగానాలు వంటి అనేక కళారూపాలకు ఆకాశవాణి గొప్ప వేదికగా నిలిచింది. తెలుగు సాహిత్యం, పద్యనాటకాలు, కథలు, కవిత్వం, సంగీత సంప్రదాయాల పరిరక్షణలో విశేష పాత్ర పోషిస్తూనే ఉంది మన ఆకాశవాణి.

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాలు కోట్లాది భక్తులకు శ్రవణానందాన్ని అందించాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్నట్లుగా అనుభూతిని కలిగించే విధంగా ప్రసారాలను అందించడం ఆకాశవాణి ప్రత్యేకత. కాలానుగుణంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆకాశవాణి తన కార్యక్రమాలను నిరంతరం నవీకరించుకుంటూ ముందుకు సాగుతోంది. సామాజిక మాధ్యమాలు లేని రోజుల నుండి డిజిటల్ యుగం వరకు వచ్చిన మార్పులను స్వాగతిస్తూ, యువతను ఆకట్టుకునే నూతన కార్యక్రమాలను రూపొందిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎఫ్.ఎమ్. ప్రసారాలు, డిజిటల్ స్ట్రీమింగ్, మొబైల్ యాప్లు, ఆన్లైన్ వేదికల ద్వారా కొత్త తరానికి చేరువవుతోంది. నూతన ఆలోచనలు, ఆధునిక అంశాలు, యువత అభిరుచులకు అనుగుణమైన కార్యక్రమాలు, కెరీర్ మార్గదర్శకాలు, సాంకేతిక విజ్ఞానం, సామాజిక చైతన్య అంశాలతో శ్రోతలను అలరిస్తోంది. పాతతరం అనుభవాలను, కొత్తతరం ఆశయాలను కలిపే వారధిగా నిలుస్తోంది. అందుకే నాటి తరం నుండి నేటి తరం వరకు అందరి హృదయాలలో ఆకాశవాణి ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది.

తెలుగు మాత్రమే కాకుండా హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ, కన్నడ తదితర అనేక భాషల్లో కార్యక్రమాలను అందిస్తూ జాతీయ సమైక్యతకు దోహదపడుతోంది. సమాచారం, విద్య, వినోదం అనే త్రివేణి సంగమంగా భారతీయ సమాజ అభివృద్ధికి నిరంతరం తోడ్పడుతోంది. తొంబై వసంతాల ఈ మహోత్సవ వేళ, ఆకాశవాణి సేవలను స్మరించుకుంటూ, ఈ మహోన్నత ప్రసార సంస్థతో అనుబంధం కలిగిన శ్రోతలు, కళాకారులు, రచయితలు, వ్యాఖ్యాతలు, సాంకేతిక నిపుణులు, అధికారులు, ఉద్యోగులందరికీ హృదయపూర్వక అభినందనలు. 90 వసంతాల విజయగాథను సొంతం చేసుకున్న ఆకాశవాణి మరెన్నో శతాబ్దాల పాటు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, సమాచారం - విద్య - వినోదాల చిరునామాగా చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షిస్తూ...

శుభాకాంక్షలు ఆకాశవాణి!

ఎంతైనా రేడియోతో అనుబంధం జీవితంతో పెనవేసుకుపోయిన ప్రేమ సంబంధం... నిత్యం నిరంతరం...

## ప్రపంచ పర్యాటక కేంద్రంగా యాదగిరిగుట్ట

మహర్దశ పట్టనుంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరానికి అతి చేరువలో ఉన్న యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం తెలంగాణలో ఆధ్యాత్మిక పర్యాటకానికి చిరునామాగా మారింది. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దే క్రమంలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణం, పరిసర ప్రాంతాల అభివృద్ధి చేపట్టిన ప్రభుత్వం.. ఇప్పుడు కేంద్ర నిధుల సహకారంతో మరింత భారీ ప్రణాళికలకు శ్రీకారం చుట్టింది.

**ఆధ్యాత్మికతకు ఆధునికత జోడింపు..**

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం తర్వాత భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. వీకెండ్, పండుగల సమయంలో లక్షలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్నారు. అయితే పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా రోడ్లు, పార్కింగ్, వసతి, పర్యాటక సదుపాయాల విస్తరణ అవసరమవుతోంది. ఆలయ పున నిర్మాణ సమయంలోనే ఆలయ సన్నిధిలో ప్రపంచస్థాయి పర్యాటకులకు వసతి కల్పనకు అవసరమైన ఫైవ్ స్టార్ స్థాయి సదుపాయాలతో కాటేజీలు, కన్వెన్షన్ సెంటర్లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదించారు. అయితే నిధుల కొరతతో కేవలం ఆలయ పునర్నిర్మాణం, రహదారులు, ల్యాండ్ స్కేప్ గార్డెన్లు మాత్రమే అభివృద్ధి చేశారు. యాదగిరిగుట్టకు వస్తున్న పర్యాటకులకు సరైన వసతి సదుపాయాలు అందుబాటులో లేకుండా పోయాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి, అధికారులతో సమీక్ష సందర్భంగా మౌలిక సదుపాయాలు, వసతి సౌకర్యాలపై చర్చించినప్పటికీ నిధుల కొరత ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం పర్యాటక ప్రాంతాలకు అందించే వడ్డీలేని మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సాయంలో నిధులను రాబట్టాలని భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మూలధనం పెట్టుబడి సాయం పథకంలో రాష్ట్రాల్లోని వివిధ పర్యాటక ప్రాంతాలకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటికే విశేష సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తున్న ప్రాంతాలను ప్రపంచస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా దేశ విదేశాల పర్యాటకులను ఆకర్శించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రప్రభుత్వ మూలధన పెట్టుబడి కోసం సహాయ పథకంలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను వడ్డీలేని రుణాలుగా అందిస్తోంది. ఇందుకోసం ఆధ్యాత్మిక విశ్వనగరిగా రూపుదిద్దుకున్న యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతోపాటు ఆధునిక దేవాలయంగా ఖ్యాతినొందిన నాగార్జునసాగర్ బుద్ధవనం, ప్రకృతిరమణీయ పచ్చటి కొండలు, గుట్టలతో అడ్వెంచర్ టూరిజంకు ప్రసిద్ధమైన వికారాబాద్ ప్రాంతంలోని అనంతగిరి కొండలను సైతం ఈ పథకంలో నిధుల మంజూరుకు ప్రతిపాదించారు.

**యాదగిరిగుట్టకు రూ.500 కోట్లతో మహా ప్రణాళిక..!**

ఈ మూలధన పెట్టుబడి ప్రత్యేక సాయం పథకం కింద యాదాద్రి ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్ల ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ నిధులతో యాదగిరిగుట్టలో ఆధునిక మౌలిక సదుపాయాలు, పర్యాటక ఆకర్షణలు, రవాణా వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపాదిత రూ.500 కోట్లతో కొండ చుట్టూ రింగ్ రోడ్లు, ఆధునిక పార్కింగ్ కేంద్రాలు, ఎలక్ట్రిక్ వాహనాల సేవలు, పర్యాటక సమాచార కేంద్రాలు, డిజిటల్ గైడెన్స్ వ్యవస్థలు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి.

**యాదాద్రి చుట్టూ టూరిజం సర్క్యూట్..**

కేవలం ఆలయానికే పరిమితం కాకుండా, యాదాద్రిని కేంద్రంగా చేసుకుని భువనగిరి కోట, సురేంద్రపురి, కొలనుపాక జైన దేవాలయం, పోచంపల్లి వంటి ప్రాంతాలను కలుపుతూ సమగ్ర పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచన కూడా ఉంది. ఇది అమలైతే దేశీయ, విదేశీ పర్యాటకులు ఒకే ప్రాంతంలో ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక అనుభూతులను పొందే అవకాశం ఉంటుంది. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం, నాగార్జునసాగర్ బుద్ధవనం, అనంతగిరి కొండలను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పనకు చేపట్టే చర్యలకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టును అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి నిధులను మంజూరు చేయనుంది. ఈ పథకం మంజూరు అయితే.. తిరుమల, వైష్ణోదేవి తరహాలో యాదాద్రిని అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే ఆలయ నిర్మాణ శైలి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకోగా, ఇప్పుడు పర్యాటక మౌలిక సదుపాయాల విస్తరణ ద్వారా ప్రపంచ పటంలో యాదాద్రికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే సంకల్పం కనిపిస్తోంది.

## మీ ఏరియా వాల్యూ ఎంతో తెలుసా

**జయభేరి, హైదరాబాద్, జూన్ 7 :**

రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, అపార్టుమెంట్లు, ఇళ్లకు కొత్త మార్కెట్ విలువ శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లన్నీ 5వ తేదీ నుంచి కొత్త విలువ ఆధారంగానే జరగనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగు భూములు, ఖాళీ స్థలాలకు మార్కెట్ విలువను 50 నుంచి 100శాతంకు పెంచగా.. అపార్టుమెంట్లకు సంబంధించి 10 శాతం నుంచి 20శాతం వరకు పెంపుదల జరిగింది. కొన్ని ప్రాంతాల్లో పాత విలువనే కొనసాగించారు. అయితే, రాష్ట్రంలో కనిష్ఠంగా భూముల ధర ఇంతకుముందు ఎకరా రూ.1.75 లక్షలు ఉండగా దాన్ని రూ.2.75 లక్షలకు పెంచారు.

**ఇలా చెక్ చేసుకోండి..** తెలంగాణ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిపార్ట్ మెంట్ వెబ్ సైట్ లోకి వెళ్లండి. https://registration.telangana.gov.in/ అందులో ఆన్ లైన్ సర్వీసెస్ అనే విభాగంలో మార్కెట్ వాల్యూ సెర్చ్ అని ఉంటుంది. దానిపై క్లిక్ చేయండి.

భూముల విలువ చెక్ చేయాలంటే Land Value మీద క్లిక్ చేయండి. మీరు చెక్ చేయాలనుకున్న జిల్లాను ఎంచుకోండి. ఆ తర్వాత మీరు చెక్ చేయాలనుకున్న మండలం పేరును సెలక్ట్ చేయండి. ఏ గ్రామం/పట్టణంలో మీరు లాండ్ రేట్ చూడాలనుకుంటున్నారో ఆ పేరు సెలక్ట్ చేసి SUBMIT క్లిక్ చేయండి. మీకు కావాల్సిన డిటెయిల్స్ అన్నీ అక్కడ కనిపిస్తాయి. ఏ ఏరియాలో చదరపు గజం ఎంత ఉందో కనిపిస్తుంది.

అపార్ట్ మెంట్ మార్కెట్ వాల్యూ తెలుసుకోవాలంటే.. అపార్ట్ మెంట్ మార్కెట్ విలువ చెక్ చేయాలంటే Apartment Value అని ఉంటుంది. దాన్ని సెలక్ట్ చేయాలి. ఆ తర్వాత ఏ జిల్లానో సెలక్ట్ చేయాలి. ఆ తర్వాత మండలం పేరు ఎంచుకోవాలి. ఏ గ్రామం/ పట్టణంలో ఉందో అది సెలక్ట్ చేయాలి. మీకు కావాల్సిన డిటెయిల్స్ అన్నీ అక్కడ కనిపిస్తాయి. ఏ ఏరియాలో చదరపు అడుగు ఎంత ఉందో కనిపిస్తుంది.

ప్రభుత్వ మార్కెట్ విలువ, బహిరంగ మార్కెట్ విలువ వేర్వేరుగా ఉంటాయి. రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు ప్రభుత్వ మార్కెట్ విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

# ప్రతి ఆదివారం ప్రజాయాత్ర ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండా

- మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

**జయభేరి, మేడిపల్లి :**




మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రజా పర్యటన నిర్వహించారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పీర్జాదిగూడ ఓల్డ్ విలేజ్ గుట్ట, డబుల్ బెడ్రూమ్ సముదాయం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తీవ్ర తాగునీటి సమస్యను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వారానికి ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే నీరు వస్తోందని, వచ్చినా తక్కువ ఒత్తిడితో సరఫరా కావడంతో అవసరాలకు సరిపోవడం లేదని మహిళలు వాపోయారు. చాలామంది తాగునీటి కోసం ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. అలాగే కొన్ని గల్లిలలో రోడ్డు నిర్మాణం మరియు డ్రైనేజి సమస్యలతో పాటు రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని స్థానికులు కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు బిల్లులు రాక నిలిచిపోయాయని అప్పులు తెచ్చి అద్దె కట్టుకునే పరిస్థితి వచ్చిందని పలువురు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు కల్పించి స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు.

పీర్జాదిగూడ గుట్టపై సుమారు 50 లక్షల లీటర్ల సామర్థ్యంతో భారీ నీటి రిజర్వాయర్‌ను నిర్మించి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పించినప్పటికీ, ప్రస్తుతం ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా అందకపోవడం బాధాకరమని అన్నారు. ఇంతటి మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడాల్సి రావడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. వెంటనే నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి క్రమం తప్పకుండా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకురావడమే ఈ ప్రజా పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

తాగునీరు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, మైనార్టీ అధ్యక్షులు జిలాని పాషా, ఆకుల మధుకర్, శ్యామాల శ్రీనివాస్, శ్రీకాంత్, కౌడే సాయి శరత్, బాలరాజు, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, గడీల జగన్ రెడ్డి, అశోక్ రెడ్డి, సాగర్ రెడ్డి, జమీల్, పన్నబాయ్, గోపాల్ రెడ్డి, పాశం నరేందర్ రెడ్డి, సురేష్, పుల్ల శ్రీనివాస్, వెంకట్, వేంకటరమణ కలిసి పాల్గొన్నారు.







## పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జిగా ముష్యం శ్రీనివాస్

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత వేగం చేకూర్చే లక్ష్యంతో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జిగా ముష్యం శ్రీనివాస్ ని నియమించారు. ఈ సందర్భంగా సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే నివాసంలో ముష్యం శ్రీనివాస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన ముష్యం శ్రీనివాస్, పార్టీ ఆశయాలు, నాయకత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు ప్రజలకు సేవ చేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ముష్యం శ్రీనివాస్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వంజరి కుల ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ బాగాయత్ లో నిర్వహించిన వంజరి కుల ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, సామాజికవేత్తలు, సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్యక్రమానికి హాజరై వంజరి సమాజ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ అభ్యున్నతి, విద్యా ప్రగతి, సామాజిక ఐక్యత కోసం ఇలాంటి ఆత్మగౌరవ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారుడు VH హనుమంత్ రావు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వంజరి సమాజ ఐక్యతకు, సామాజిక అభివృద్ధికి ఈ భవనం కేంద్రబిందువుగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంపై తెలంగాణ వంజరి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేరు నరేందర్ - అధ్యక్షుడు కే. వెంకటేశం - ప్రధాన కార్యదర్శి వంజరీ ప్రవీణ్ - కార్యనిర్వహణ కార్యదర్శి తెలంగాణ వంజరి సంఘం తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతీయ సమాజ్ నూతన భవన ప్రారంభోత్సవం



**జయభేరి, ఉప్పల్ :**

సోమవంశ సహస్రార్జున క్షత్రియ పట్కర్ (ఖత్రి) ప్రాంతీయ సమాజ్ నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో సోమవంశ సహస్రార్జున క్షత్రియ పట్కర్ (ఖత్రి) ప్రాంతీయ సమాజ్ నూతన భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు విహెచ్ (వి. హనుమంతరావు)తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సమాజ అభివృద్ధికి కుల భవనాలు సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలకు కేంద్రాలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజ ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు యువతకు మార్గదర్శకంగా ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం 2026 విద్యా సంవత్సరంలో సోమవంశ సహస్రార్జున క్షత్రియ పట్కర్ (ఖత్రి) ప్రాంతీయ సమాజ్‌కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినందుకు వారిని అభినందించి ఘనంగా సత్కరించారు. విద్యార్థులు విద్యారంగంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పట్కర్ సమాజ్ ప్రతినిధులు, పెద్దలు, యువత, మహిళలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.



## కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేయాలి

**జయభేరి, మేడిపల్లి :**

శ్రీ వరసిద్ధి వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వారి అభివృద్ధి కోసం సంఘం నాయకులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గౌరారం సాయి రెడ్డి, ఉపాధ్యక్షుడు నరాల వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బండారు శ్రీను, కోశాధికారి కొలుకుల ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి కొలుపుల కుమార్, ప్రచార కార్యదర్శి వడ్డె రామస్వామి, పలువురు కార్మికులు, సంఘ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొని నూతన సంఘానికి శుభాకాంక్షలు తెలిపారు.

## గద్వాల ఆసుపత్రి లేక వైకుంఠ రథ యాత్రనా..

- గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాలు హం ఫట్
- పట్టించుకోని ప్రభుత్వ వైద్యశాల సూపరెండేంట్
- ట్రైనీ డాక్టర్ లతో ఆపరేషన్ చేయించిన ఆసుపత్రి సూపరెండేంట్
- వైద్యుల నిర్లక్షానికి ఎర్రవల్లి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక బలి

**జయభేరి, గద్వాల :**

పేషెంట్ కు అపెండిక్స్ అని తెలిసి కూడా వైద్యుల నిర్లక్ష్యం సరైన సమయంలో ఒక రోజు ముందే అడ్మిట్ అయినా కూడా సరైన సమయంలో స్పందించక అనుభవస్తులైన డాక్టర్ లతో చికిత్స అందించక ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న ఆసుపత్రి సూపరెండేంట్. అహంకార ధోరణితో ప్రవర్తిస్తూ కింది స్థాయి ఉద్యోగస్తుల పై అజమాయిషీ చేస్తూ చేస్తున్న ఉద్యోగం కంటే రాజకీయాలే నా ప్రధాన ఉద్యోగం అన్నట్టు ప్రవర్తిస్తూ నిర్లక్ష ధోరణితో వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి అంటే దేవాలయం అని నమ్మే సామాన్యుడికి వైకుంఠ యాత్రకు కేరాఫ్ అనేటట్టు చేసేశారు. ఇదో విడ్డురం.. న్యాయం కోసం పోరాటం చేస్తే చేసినవాళ్ళని అక్రమ అరెస్టులు పైగా వారిపై కేసులు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సూపరెండేంట్ ను తక్షణమే సస్పెండ్ చెయ్యాలి ఆమె పై కలెక్టర్ విచారణ కమిటీ వెయ్యాలి.. ఆరోపణ నిజమైతే సర్వీస్ రిమోవ్ చెయ్యాలి బాధితురాలికి న్యాయం చెయ్యాలి.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

- విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**



కాప్రాలోని భావసార్ క్షత్రియ సమాజ్ హైదరాబాద్ (నార్త్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని, సమాజ సేవా సంస్థలు విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భావసార్ క్షత్రియ సమాజ్ హైదరాబాద్ (నార్త్) సంస్థ విద్యార్థుల కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో మందికి ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు నవీన్ గౌడ్, బద్రుద్దీన్, పిల్లి సాయి రామ్, భావసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు కిశోర్ నర్సింగ్ రావు టాండ్లే, కార్యవర్గ సభ్యులు, ప్రముఖులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మన్యంకొండలో వైభవంగా తిరుచ్చి సేవ

- సాంప్రదాయ రీతిలో చైర్మన్ అళ హరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు
- అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చిన స్వామివారు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ పవిత్ర పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామివారిని దేవస్థానం పురవీధుల గుండా ఊరేగించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వైద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినా మశ్చరణల మధ్య స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా దేవాలయంలోని రథ ఆధ్వర్యంలో అళహరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరిగి మళ్ళీ తిరుచ్చి వాహనంపై గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు తిరుచ్చి వాహనంపై అలంకరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశ పారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య పర్యవేక్షకుడు నిత్యానంద చారి, దేవస్థానం పురహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట

- ఆదివారం స్వామి వారిని దర్శించుకున్న 92 వేల మంది భక్తులు



జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 7:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లు,ప్రసాద విక్రయశాల, లక్ష్మీపుష్కరిణి, కల్యాణ కట్ట, బస్టాండ్, శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. ధర్మ దర్శనానికి 4 గంటలు, వీవీఐపీ దర్శనానికి 3 గంటల సమయం పట్టింది.

సుమారు 92 వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. తెల్లవారు జామునే ఆలయ తలుపులు తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ,ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయం భూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు.

స్వామివారికి తులసీ సహస్ర నామార్చన,అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి,అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులకు కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి,అమ్మ వార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణత్సవ సేవ నిర్వహించారు.

కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళలో స్వామి వారికి తిరు వీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రివేళలో స్వామివారి తిరు వారాధన చేపట్టి, స్వామివారికి తులసీ సహ స్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరి పారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. అన్ని విభాగాలను కలుపుకుని స్వామి వారి ఖజానాకు రూ.73,75,642 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు.



## శ్రీలక్ష్మీ నారసింహుడిని దర్శించుకున్న కిషన్ రెడ్డి, ఈటెల రాజేందర్

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 07 :

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి వారిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాల్కాజ్ గిరి ఎంపి ఈటెల రాజేందర్ దర్శించుకున్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణా శిబిరంలో పాల్గొనేందుకు శనివారం కిషన్ రెడ్డి యాదగిరిగుట్టకు వచ్చారు. శనివారం రాత్రి యాదగిరిగుట్ట లోనే బస చేసి ఆదివారం తెల్లవారుజామున స్వామివారి అభిషేక సేవలో పాల్గొన్నారు. యాదగిరిగుట్టకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి,ఈటెల రాజేందర్ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా శ్రీలక్ష్మీ నర సింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా,యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు కిషన్ రెడ్డి, ఈటెల రాజేందర్ తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ తో పాటు స్థానిక జిజెపి నేతలు తదితరులు పాల్గొన్నారు.



## చేనేత వస్త్రాలను సందర్శించిన యాదగిరిగుట్ట

- మున్సిపల్ పాలకవర్గం సభ్యులు




జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 07 :

హైదరాబాద్ హైటెక్ సిటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోచంపల్లి చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ను యాదగిరిగుట్ట మున్సిపల్ పాలకవర్గం సభ్యులు సందర్శించింది. ఆదివారం సందర్శించిన అనంతరం యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణీభరత్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రాల ప్రాధాన్యతను, గొప్పతనాన్ని తెలియజేయడం కోసం, చేనేత కార్మికులకు చేయూతను అందించడం కోసం చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని తెలిపారు. యంత్రాల మీద తయారు చేసే వస్త్రాల కన్నా చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలు ఎంతో ఆకర్షణీయంగా,నాణ్యతగా ఉన్నాయని అన్నారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగె రమ్య రామచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బోడ రాధాసురేష్, బూడిద మధు, కాటబత్తిని స్వప్నఆంజనేయులు, బిట్టు సరోజహరీష్, కర్రె మాధవి ప్రవీణ్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్, సాదునేని ధనలక్ష్మి మధుకర్, పేరబోయిన సత్యనారాయణ, బబ్బురి శ్రీధర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బండి జంగమ్మశ్రీశైలం, గౌలీకార్ అరుణరాజేష్, ఎండి రహీమాసలాం, ఎస్ కే ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత




జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 7 :

మిషన్ భగీరథ పథకం కింద గ్రామాలకు అందజేసే గోదావరి నీటి సరఫరాను నేడు,రేపు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ పథకం జిల్లా ఈఈ పి.కరుణాకరన్ ప్రకటించారు. తుర్కపల్లి మండలంలోని వెంకటాపురం 700 ఎంఎండీఐ పైప్ లైన్ లో లీకేజీలు ఏర్పడిన కారణంగా మరమ్మత్తు పనులు చేపట్టామన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లాలోని ఆలేరులో 18, ఆత్మకూరు(ఎం)లో 12, భువనగిరిలో ఒక గ్రామం, మోటకొండూర్ మండలంలో 24, యాదగిరిగుట్టలో 26, రాజాపేటలో 33, గుండాల 23, తుర్కపల్లిలో 5 ఆవాస గ్రామాలతో పాటు యాదగిరిగుట్ట ఆలయం, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 142 ఆవాసాలకు గోదావరి నీటి సర ఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అప్పటివరకు ప్రత్యామ్నాయంగా స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులకు విజ్ఞప్తి చేశారు.

# గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత

- పోలీసు శాఖకు సహకరించాలని పిలుపునిచ్చిన సీఐ.




జయభేరి, పరవాడ:

గంజాయి నిర్మూలనకు చేపట్టిన 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం పరవాడ మండలం పెదముసిడివాడ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించబడింది.ఈ సందర్భంగా పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామంలో గంజాయి విక్రయాలు, సరఫరా, రవాణా లేదా నిల్వ చేస్తున్న వారి గురించి ప్రత్యేకంగా ఆరా తీసినట్లు తెలిపారు. గంజాయి అమ్మకం, సరఫరా వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి వారి గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.పెదముసిడివాడ గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి ఉండటంతో గంజాయి అక్రమ నిల్వలు, రవాణా జరిగే అవకాశాలు ఉన్నందున గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.గంజాయి విక్రయించే వారు, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అయితే గంజాయి సేవించే వారిని మాదకద్రవ్యాల బారిన పడిన బాధితులుగా భావిస్తున్నామని తెలిపారు. అటువంటి వారు లేదా వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసులను సంప్రదిస్తే వారికి అవసరమైన సహకారం అందించి డీఅడిక్షన్ సెంటర్ల ద్వారా ఆ అలవాటును శాశ్వతంగా మానుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, మహిళల భద్రత తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కరణం నర్సింగరావు, బోండా అచ్చిబాబు, పిల్లా అప్పారావు, పిల్లా సతీష్, ఒమ్మి అప్పారావు, బలిరెడ్డి సతీష్, దలిబోయిన దేవుడు, పల్ల దేవుడు, నరసింహమూర్తి, పిల్లా వెంకటేష్, రావాడ శివ, శంకర్, సంతోష్, ప్రసాద్, హేమంత్ రాజు, దుల్ల సురేష్, రమేష్, శ్రీనివాస్, గణేష్ తదితర గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పరవాడ మండలం కిసాన్ మోర్చ అధ్యక్షుడిగా నాగరాజు

జయభేరి, పరవాడ:

పరవాడ మండల భాజపా ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మండల సమావేశంలో నూతన మండలపార్టీ కిషన్ మెర్చ్ అధ్యక్షుడుగా మాసవరపు నాగరాజును బిజెపి మండల అధ్యక్షులు పిల్లాసతీష్ నియమించారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పట్టభద్రులైనా గత 15 సంవత్సరాలుగా స్వయం సేవక్ గా ఉంటూ పది సంవత్సరాల నుండి భాజపా మండల ఉపఅధ్యక్షునిగా పనిచేశాను అని అన్నారు జిల్లా ఉపాధ్యక్షులుగా బండారు రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందేటట్లు పార్టీని విస్తృతంగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తానని తెలియజేశారు.

# కుమ్మరులు రాజకీయంగా ఎదగాలి

- జూన్ 30న కొండమల్లేపల్లి లో నియోజకవర్గస్థాయి సర్వసభ్య సమావేశం
- నల్గొండ జిల్లా కన్వీనర్ రాధారావు బిక్షపతి
- దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ తోటపల్లి కిరణ్



జయభేరి, కొండమల్లేపల్లి :

దేవరకొండ నియోజకవర్గం ఎనిమిది మండలాల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నల్గొండ జిల్లా కన్వీనర్ రాధారపు భిక్షపతి, దేవరకొండ నియోజకవర్గం కన్వీనర్ తోటపల్లి కిరణ్ అన్నారు. జూన్ 30న మంగళవారం ఉదయం 10 గంటలకు కొండమల్లేపల్లి లో సాయి కృప ఫంక్షన్ హాల్ లో నిర్వహించే సర్వసభ్య సమావేశ కరపత్రాన్ని ఆదివారం కొండమల్లేపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మరులు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలన్నారు. దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది మండలాలలో గ్రామ కమిటీలు మండల కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కుమ్మరుల హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఈ కరపత్ర ఆవిష్కరణలో నిదానం పల్లి వెంకటస్వామి, నిమ్మనగోటి వెంకన్న, చిట్టిమల్ల ఆంజనేయులు, కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు ఏరుకొండ రాము, గణపురం వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి దశరథం, తోటపల్లి వెంకటయ్య, నెల్లికంటి గోపి, తోటపల్లి శ్రీనివాస్, బత్తుల ఎల్లయ్య, బొడ్డుపల్లి మల్లయ్య, బొడ్డుపల్లి వెంకటేష్, బత్తుల ప్రసాద్, తోటపల్లి వెంకటేష్, బొడ్డుపల్లి బాలకృష్ణ, బొడ్డుపల్లి మల్లేష్ పాల్గొన్నారు.

## పార్థివ దేహానికి నివాళులర్పించిన ఆర్టిఐ కమిషనర్



జయభేరి, తుర్కపల్లి, జూన్ 07 :

తుర్కపల్లి మండలం పల్లె పహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ సోక్కుల మోహన్ రెడ్డి మాతృమూర్తి మాజీ సర్పంచ్ సోక్కుల యశోదమ్మ మరణించడంతో ఆమె పార్థివ దేహానికి తెలంగాణ రాష్ట్ర ఆర్టిఐ కమీషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు .ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బిచ్చు నాయక్, గ్రామస్తులు రాళ్ల బండి సుగ్రీవ చారి ,సతీష్ కుమార్, శ్రీశైలం, కనకరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పద్మశాలి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

- జిల్లా అధ్యక్షులుగా పెండెం శ్రీనివాస్



జయభేరి, యాదగిరిగుట్ట :

తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షునిగా పెండెం శ్రీనివాసు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ఎన్నికల అధికారి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చేరాల మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యదర్శిగా రచ్చ గణేష్ ప్రసాద్, సహ అధ్యక్షులుగా బడుగు పాండు, ఉపాధ్యక్షులుగా ఉదారు బలరాం, మేడిశెట్టి జీవన్ కుమార్, కైరం కొండ బాలమణి, సహాయ కార్యదర్శులుగా పాసికంటి పవన్ కుమార్, ఎలగందుల శ్రీకాంత్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నుంచు వెంకటయ్య, గంజి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శిగా బింగి చక్రపాణి, కార్యవర్గ సభ్యులు మీన సురేందర్, తుమ్మ కృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనంతరం నూతన అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని, రాబోవు రోజుల్లో టిపియూఎస్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పద్మశాలి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈనెల 13,14 వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పద్మశాలి ఉద్యోగ ప్రతినిధుల 4 వ సమావేశానికి పద్మశాలి ఉద్యోగుల సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

# దూసుకొస్తున్న నైరుతి రుతుపవనాలు



తెలుగు రాష్ట్రాలకు చల్లని కబురు..వేసవి ఎండలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తున్నాయి. అదివారం (జూన్ 7, 2026) నాటికి పశ్చిమమధ్య, ఈశాన్య బంగాళాఖాతం అంతటా రుతుపవనాలు ప్రవేశించాయి. వీటితో పాటు వాయువ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మణిపూర్, మిజోరాంలను పూర్తిగా కవర్ చేస్తూ.. త్రిపుర, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలకు ఇవి మరింత విస్తరించాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. రాబోయే 2 నుంచి 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లోకి, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ప్రస్తుతం తూర్పు ఉత్తరప్రదేశ్ నుండి ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఒక ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తెలంగాణలోని కొన్ని జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉంది.

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులలతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. అయితే గరిష్ట ఉష్ణోగ్రతల్లో రానున్న మూడు రోజులు పెద్దగా మార్పులు ఉండవని అధికారులు స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్, యానాంలలో వాతావరణ సూచన

అమరావతి వాతావరణ కేంద్రం నివేదిక ప్రకారం, ప్రస్తుతం కోస్తా కర్ణాటక పరిసర ప్రాంతాల నుండి కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు సుమారు 14 ఉత్తర అక్షాంశం వెంబడి సముద్ర మట్టానికి 3.1 నుండి 4.6 కిలోమీటర్ల ఎత్తులో ఒక అల్పపీడన ద్రోణి విస్తరించి ఉంది. దీని ఫలితంగా ఏపీలోని వివిధ ప్రాంతాలలో రాగల మూడు రోజులు వాతావరణం ఇలా ఉండనుంది. రేపు సోమవారం ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చు. అక్కడక్కడ వడగాలులు వీచే ప్రమాదం ఉంది. అలాగే ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 4050 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఎల్లుండి తేలికపాటి వర్షాలతో పాటు వాతావరణంలో వేడి, తేమ పెరిగి తీవ్ర అసౌకర్యంగా మారే అవకాశం ఉంది. ఈదురుగాలులు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయి. కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, 4050 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఇక ఎల్లుండి కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు పడే ఛాన్స్ ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల ప్రభావంతో పాటు వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. రాయలసీమలో కొన్ని చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గంటకు 4050 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయి. రేపు, ఎల్లుండి కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడతాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ ప్రాంతాలలో రాబోయే 5 రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలలో పెద్దగా మార్పులు ఉండకపోయినా, ఎండల తీవ్రత కొద్దిగా తగ్గే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు తెలిపారు.




## పరవాడ మండలంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ జి పావని డిమాండ్

జయభేరి, పరవాడ:

మండల కేంద్రమైన పరవాడలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం సబ్ స్టేషన్ జంక్షన్ సమీపంలో నిరసన కార్యక్రమం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ జీ పావని మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పరవాడలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గాజువాక విశాఖపట్నం వెళ్లి డిగ్రీ చదువుకోవడానికి సామాన్య మధ్యతరగతి విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పరవాడ మండలంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయకపోవడం వలన ఉన్నత విద్యకి ఈ ప్రాంత విద్యార్థిని విద్యార్థులు అందని దక్షగా మారిందని అన్నారు. వెంటనే డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పావని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భువన, ప్రియా, లక్ష్మి, తేజ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టు చీర వేడుకల్లో ఎమ్మెల్యే సోదరుడు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చందు గౌడ్ కుమార్తె పుట్టు చీర మహోత్సవానికి దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే చిన్నచింతకుంట మండలం అల్లిపూర్ లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దామోదర్ కుమార్తె పుట్టు చీర కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఇక్కడ కూడా చిన్నారిని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## బాధితులకు ఎమ్మెల్యే సోదరుడి ఆర్థిక సహాయం అందజేత

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం ఎదులాపూర్ లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటీవల మహబూబ్ నగర్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏదులాపూర్ గ్రామానికి చెందిన పద్మమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడి తమ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశానుసారం బాధితురాలు స్వగ్రామానికి వెళ్లి బాధితురాలికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే అదే ప్రమాదంలో గాయపడ్డ శ్రీనివాస్ గౌడ్ కు కూడా ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కూచిపూడి కళకు పట్టం కట్టిన రాగ్ని కళానిలయం

- 41 రోజుల శిక్షణకు ముగింపు.. వైభవంగా వార్షికోత్సవ వేడుకలు
- రాగ్ని కూచిపూడి కళానిలయం తొలి వార్షికోత్సవం

జయభేరి, షాద్ నగర్, జూన్ 07 :



రాగ్ని కూచిపూడి కళానిలయం తొలి వార్షికోత్సవ వేడుకలు, రెండవ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం పట్టణంలోని ఠాగూర్ స్కూల్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. రాగ్ని కూచిపూడి కళానిలయం ఆధ్వర్యంలో శివ మారుతి గీతా అయ్యప్ప కళ్యాణమండపంలో నిర్వహించిన 41 రోజుల వేసవి శిక్షణ శిబిరంలో 50 మంది విద్యార్థినులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి హరీశ్ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, రవిశర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్, ఠాగూర్ స్కూల్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ నాయకులు బండారు రమేష్, ప్రముఖ సామాజికవేత్త, కార్మిక నాయకుడు పినపాక ప్రభాకర్, రిటైర్డ్ తహసీల్దార్ రామారావు, ప్రముఖ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థినులకు అతిథులు మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు ప్రాచీన భారతీయ నృత్య కళ అయిన కూచిపూడిని భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్న నృత్య గురువు రాగ్నిని ప్రత్యేకంగా అభినందించారు. వందలాది మంది విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ కళా సంప్రదాయాన్ని పరిరక్షిస్తున్నారని కొనియాడారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

అలాగే రాగ్ని తల్లిదండ్రులు, ప్రముఖ జ్యోతిష్యులు మరియు పురోహితులు రవిశర్మ దంపతులను, నృత్య గురువు రాగ్నిని అతిథులు సన్మానించారు. అనంతరం నిర్వాహకులు మాధురిరవిశర్మ దంపతులు ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా నృత్య గురువు రాగ్ని మాట్లాడుతూ శివ మారుతి కళ్యాణమండపంలో వారానికి మూడు రోజుల పాటు కూచిపూడి నృత్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, కళాభిమానులు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## కర్ణాటకలో ఆర్యవైశ్య మహిళల పూజలు

- అధికమాసం సందర్భంగా దేవాలయాల సందర్శన



జయభేరి, దేవరకద్ర :


మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు ఆదివారం కర్ణాటకలోని వివిధ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికమాసాన్ని పురస్కరించుకొని వారు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక లోని రాయచూర్ లో ఉన్న మారెమ్మ, పొందాలమ్మ దేవాలయాలను వారు దర్శించుకున్నారు. జేష్ఠ అధిక మాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు 33 అమ్మవార్లకు ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఆయా దేవాలయాలను సందర్శించి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. దేవరకద్ర జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి ఆధ్వర్యంలో దేవతామూర్తుల ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత మెగా హెల్త్ క్యాంప్



జయభేరి, కుత్బుల్లాపూర్ :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాంధీ నగర్ పరిధిలోని ఠాగూర్ హై స్కూల్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దపురం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో, ప్రసిద్ధ అలీవ హాస్పిటల్ సౌజన్యంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను వారి నివాస ప్రాంతాలకే తీసుకువచ్చి అందించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. నిరుపేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమఉచిత పరీక్షలు మందులు వైద్య శిబిరానికి విచ్చేసిన వందలాది మంది స్థానిక ప్రజలకు అలీవ హాస్పిటల్ నిపుణులైన వైద్య బృందం ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ముద్దపురం శ్రీకాంత్ గౌడ్, అలీవ హాస్పిటల్ డాక్టర్లను, పారామెడికల్ సిబ్బందిని హన్మంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.



# ఎంఎంసీ నూతన భవనానికి భూమి పూజ

జయభేరి, ఉప్పల్ :



ఉప్పల్ బగాయత్‌లో రూ.99 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. నూతన కార్యాలయ భవనంతో పాటు పలు అభివృద్ధి పనులకు కూడా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధునిక సౌకర్యాలతో నిర్మించనున్న ఈ కార్యాలయ భవనం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన మున్సిపల్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మల్కాజిగిరి ప్రాంత అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పుట్టు చీర వేడుకల్లో హైకోర్టు న్యాయవాది



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చందు గౌడ్ కుమార్తె పుట్టు చీర మహోత్సవానికి హైకోర్టు న్యాయవాది, దేవరకద్ర నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మండడి సరోజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖమ్మంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా..

- 36 మంది ప్రయాణికులు..

జయభేరి, ఖమ్మం జిల్లా :



ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని కొత్తలంకపల్లి రైల్వే వంతెనపై ఆదివారం అర్ధరాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే మరో ముగ్గురు స్వల్పంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కేవీఆర్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంతో డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రాథమికంగా తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. స్థానికులు, క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చక్కపల్లి గ్రామం నుంచి కేవీఆర్ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సులో ధర్మాజిగూడెం, అక్కిరెడ్డిగూడెం, లింగపాలెం, రాఘవాపురం, సత్తుపల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో కొత్తలంకపల్లి రైల్వే బ్రిడ్జిపైకి చేరుకున్న బస్సు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు రోడ్డుపై బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం గాయపడిన వారిని అంబులెన్స్‌ల ద్వారా సత్తుపల్లి, పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో సత్తుపల్లికి చెందిన ఎం. శిరీష, ఎం. శివగణేశ్, పి.మల్లిక, చక్కపల్లికి చెందిన శ్రీనివాసరావు, పావని, రాఘవాపురానికి చెందిన సుస్మిత, యువన్, విజయరాయికి చెందిన ప్రణీత్, స్వప్న, బి. నరసింహ, లింగపాలెంకు చెందిన తాతిన బాలాజీ, కుంచపర్తికి చెందిన ఆర్. రామకృష్ణ ఉన్నారు. వీరందరికీ స్వల్ప గాయాలే కావడంతో ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా రైల్వే వంతెనపై సుమారు అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

